
## అప్‌డేట్ కాని జీపీలతో అవస్థలు



2





2

## సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల అవస్థలు..



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


## ఎమ్మెల్యే ధన్‌పాల్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా

**అక్షరటుడే, ఇందూరు :** నగరంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. అర్బన్‌లోని యువతీయువకుల కోసం ఈనెల 9వ తేదీన ఆర్మూర్ రోడ్‌లోని శ్రీరామ గార్డెన్స్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఎస్సెస్సీ, ఇంటర్, ఐటీఐ, పారామెడికల్ డిప్లొమా, డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ, బీటెక్, ఫార్మసీ, పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణత పొందిన యువతీయువకులు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ మెగా జాబ్‌మేళాకు సుమారు 60కి పైగా కంపెనీలు రానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా కంపెనీల్లో సుమారు 2వేలకు పైగా ఉద్యోగవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు. ఆసక్తిగల యువత 62811 59790, 93921 87672లలో సంప్రదించాలని సూచించారు.



## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

**అక్షరటుడే, మెండోరా:** స్థానికంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువన మహారాష్ట్ర నుంచి వరద వస్తుండటంతో శ్రీరాంసాగర్ (పోచంపాడ్) ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 10,540 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు, పూర్తి సామర్థ్యం 80.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1,075.00 అడుగుల వద్ద 32.897 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 39.447 టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం సుమారు 6 టీఎంసీల మేర తక్కువగా ఉంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 383 క్యూసెక్కులు కలిపి మొత్తం 914 క్యూసెక్కులు పోతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతుండటంతో శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులోకి వచ్చే వరద ప్రవాహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బాలకార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని తెలిసినా పలు షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, గ్యారేజీలు, పౌల్ట్రీ ఫారాలు, వ్యవసాయ క్షేత్రాల్లో యజమాన్యాలు చిన్నారులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారు. పేదరికాన్ని ఆసరాగా చేసుకుని కుటుంబాలకు కొంత డబ్బు ఇచ్చి, పిల్లల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారు. వీటిని నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆపరేషన్ ముస్కాన్' విజయవంతమవుతోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**



# బాల్యానికి చేయూత..

- 'ఆపరేషన్ ముస్కాన్' విజయవంతం
- ఉమ్మడి జిల్లాలో పోలీసుల విస్తృత తనిఖీలు
- వివిధ శాఖల సమన్వయంతో ముందుకు..
- వందలాది మంది బాల కార్మికుల గుర్తింపు
- యజమానులపై కేసులు.. భరోసా కేంద్రానికి చిన్నారులు

బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 2026 జూలై నెలంతా ఉమ్మడి జిల్లాలో జరిగిన ఆపరేషన్ ముస్కాన్-12 విజయవంతమైంది. దాదాపు వందకు పైగా చిన్నారులను అధికారులు రక్షించారు.

### ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమిదే..

18ఏళ్లలోపు పిల్లలను కార్మికులుగా మార్చడం, వెట్టిచాకిరి చేయించడం, భిక్షాటనకు వాడుకోవడం, ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి నెట్టడం పూర్తిగా నిర్మూలించడమే ఈ ఆపరేషన్ లక్ష్యం. తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, బాలల హక్కుల పరిరక్షణ, వారికి సురక్షితమైన బాల్యం, విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం హోటళ్లు, ఇటుక బట్టీలు, షాపులు, కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపుల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

### నెల రోజుల స్పెషల్ డ్రైవ్

ఉమ్మడి జిల్లాలో అధికారులు జూలై 1 నుంచి 31 వరకు తనిఖీలు కొనసాగించారు. పోలీసు శాఖతో పాటు కార్మిక శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, పారిశ్రామిక ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు.

### కామారెడ్డి జిల్లాలో 45 మందికి విముక్తి

ఈ నెల రోజుల ఆపరేషన్‌లో జిల్లా యంత్రాంగం కామారెడ్డి జిల్లాలోని 45 మంది బాలబాలికలను గుర్తించి రక్షించింది. వీరిలో 41 మంది బాలురు, నలుగురు బాలికలు ఉన్నారు. కామారెడ్డి డివిజన్లో 13 మంది (12 మంది బాలురు, 1 బాలిక), ఎల్లారెడ్డిలో 10 మంది బాలురు, బాన్సువాడ డివిజన్లో 22 మంది (19 మంది బాలురు, 3 మంది బాలికలు)కి విముక్తి కల్పించారు. ఎక్కువ మంది చిన్నారులు హోటళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, వ్యవసాయ పనులు చేస్తున్నారు.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ సిటీ, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో జరిపిన తనిఖీల్లో మొత్తం 119 మంది బాలలను గుర్తించారు. ఇందులో నిజామాబాద్ సబ్‌డివిజన్ పరిధిలో 43 మంది పిల్లలను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బోధన్ సబ్‌డివిజన్ పరిధిలో 49మంది బాలబాలికలు, ఆర్మూర్ బోధన్ సబ్‌డివిజన్ పరిధిలో 27 మందిని గుర్తించారు. నిజామాబాద్ డివిజన్‌లో 19, ఆర్మూర్ డివిజన్‌లో 15, బోధన్ డివిజన్‌లో 14 కేసులను నమోదు చేశారు. తప్పిపోయిన పిల్లల వివరాలను 'ట్రాక్ చైల్డ్'లో నమోదు చేసి వారి ఆచూకీ తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సీపీ సాయి చైతన్య తెలిపారు. బాలలను పనిలో పెట్టుకుంటే సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.

### భరోసా కేంద్రం.. హాస్టళ్లలో చేరిక

ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో రక్షించిన బాలలను వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారు. సీడబ్ల్యుసీ ఆదేశాల మేరకు చాలా మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కుటుంబ పరిస్థితి సరిగా లేని వారికి భరోసా కేంద్రాల్లో సంరక్షణ, వసతి, భోజనం, వైద్య పరీక్షలు అందించారు. విద్యకు దూరమైన పిల్లలను మళ్లీ బడికి పంపేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తప్పిపోయిన పిల్లల వివరాలను "ట్రాక్ చైల్డ్" పోర్టల్‌లో నమోదు చేసి వారి ఆచూకీ కోసం నిరంతరం ప్రయత్నిస్తున్నారు.

### యజమానులపై కఠిన చర్యలు

బాలలను చట్టవిరుద్ధంగా పనిలో పెట్టుకున్న యజమానులపై జిల్లా పోలీసులు 23 కేసులు నమోదు చేశారు. కామారెడ్డి డివిజన్ లో 11 కేసులు, ఎల్లారెడ్డిలో 4 కేసులు, బాన్సువాడలో 8 కేసులు నమోదు చేశారు. మరోసారి చిన్నారులను పనిలో చేర్చుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### కఠిన చర్యలు తప్పవు

చిన్నారులతో పని చేయించడం జాతీయ, రాష్ట్ర చట్టాల ప్రకారం నేరం. ఇలాచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం. వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బాలల రక్షణ అనేది ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదు. ఇది సమాజంలోని ప్రతి పౌరుడి కర్తవ్యం. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే, పిల్లలపై వేధింపులు, దోపిడీ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

**– రాజేష్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి**



## పోలీస్ ప్రజావాణికి 30 ఫిర్యాదులు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 30 ఫిర్యాదులు అందాయి. సోమవారం సీపీ సాయిచైతన్య స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వేచ్ఛగా పోలీసు సేవలను వినియోగించుకోవాలన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి



**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ లో సోమవానం నిర్వహించిన ప్రజావాణికి 121 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్ భుజంగరావుతో పాటు ట్రెయినీ కలెక్టర్ సురేష్, డీఆర్‌వో గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

## తెయూలో నియామకాలపై 'ఎస్టీ కమిషన్' సీరియస్.. అధికారులకు నోటీసులు

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో గతంలో జరిగిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల వ్యవహారం తాజాగా మళ్లీ చర్చల్లోకి వచ్చింది. ఆ నియామకాలపై జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టి సారించింది. తెయూలో 2013లో చేపట్టిన నియామక ప్రక్రియలో రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ పాలసీ, రోస్టర్ పాయింట్ విధానాన్ని సరిగా పాటించలేదనే తీవ్ర ఆరోపణలపై జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టి సారించింది. 2013 నియామకాల్లో ఎస్టీ అభ్యర్థులకు చెందాల్సిన రోస్టర్ పాయింట్లలో అక్రమాలు జరిగాయని, అర్హత ఉన్నప్పటికీ తనకు అన్యాయం జరిగిందని వెంకట్ నాయక్ జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన కమిషన్, సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది. దర్యాప్తు ప్రక్రియలో భాగంగా జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి నోటీసులు జారీ చేయడం గమనార్హం. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, తెలంగాణ యూనివర్సిటీ ఉన్నతాధికారులు, ఫిర్యాదుదారుడైన బాధితుడు వెంకట్ నాయక్.. ఈనెల 14వ తేదీన హైదరాబాద్‌లోని విచారణ కేంద్రంలో కమిషన్ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించారు. కేవలం సమాధాన పత్రాలు పంపడం కాకుండా, 2013 నాటి నియామక నోటిఫికేషన్, రోస్టర్ రిజిస్టర్లు, ఎంపిక జాబితాలు, మెరిట్ లిస్ట్‌లతో సహా.. అన్ని సంబంధిత అసలు రికార్డులను తీసుకొని విచారణకు హాజరుకావాలని కమిషన్ నోటీసులో స్పష్టం చేసింది. యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, ప్రొఫెసర్స్ నియామకాల్లో రోస్టర్ పాయింట్ల అమలు ఏళ్లుగా వివాదాస్పదంగానే ఉంటోంది. రాజ్యాంగం కల్పించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను సరిగ్గా అమలు చేయకపోవడంతో అర్హులైన అభ్యర్థులు ఉన్నత అవకాశాలను కోల్పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. 2013లో జరిగిన ఈ నియామకాల్లో రోస్టర్ పాయింట్ల గందరగోళం నిజమేనని విచారణలో తేలితే, తెలంగాణ యూనివర్సిటీ అధికారులకు ఇది పెద్ద దెబ్బగా పరిణమించే అవకాశం ఉందని విద్యావేత్తలు అంటున్నారు. కమిషన్ స్వయంగా జోక్యం చేసుకోవడం, పైగా అధికారులను నేరుగా హాజరు కావాలని ఆదేశించడంతో విచారణపై ఉత్కంఠ నెలకొంది.

## కాళేశ్వరం నీటితో ఎస్సారెస్పీ వరద కాలువకు జలకళ



**అక్షరటుడే, బాల్కొండ:** కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోయడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాలువ జలకళ సంతరించుకుంది. జగిత్యాల జిల్లాలోని రాజేశ్వరరావుపేట పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయడంతో ముప్కాల్ పంప్‌హౌస్ వరకు వరద వస్తోంది. వరద కాలువలో నీరు సమృద్ధిగా నిల్వ ఉండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## బీసీ స్టడీ సర్కిల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** రాష్ట్ర ప్రభుత్వం, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ స్టడీ సర్కిల్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి కోరారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగులకు గ్రూప్స్, బ్యాంకింగ్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, పోలీస్ నియామక పరీక్షలు, యూపీఎస్సీ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇస్తారని, పూర్తి సమాచారం కోసం tgbcstudycircle.cgg.gov.in వెబ్ సైట్ ను సందర్శించాలని సూచించారు.

## పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు : అదనపు కలెక్టర్ భుజంగరావు

**అక్షరటుడే,నిజామాబాద్ :** స్వాతంత్ర్య వేడుకలను అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం అన్ని శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ వేడుకకు సంబంధించి వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, ఫారెస్ట్, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, పౌర సరఫరాల, పంచాయతీరాజ్, ఆర్టీసీ తదితర శాఖల పనితీరును చాటేలా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పంద్రాగస్టు వేడుకకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని అన్నారు. ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్‌వో గీత, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,. డీఆర్డీవో సాయన్న పాల్గొన్నారు.



## నిజామాబాద్ జీజీహెచ్‌లో త్వరలో సూపర్ స్పెషాలిటీ సేవలు

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ను ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే రిఫరల్ సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. త్వరలోనే కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీతో పాటు ఇతర సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రారంభిస్తామని వెల్లడించారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఎంఆర్ఐ యంత్రాన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. సచివాలయంలో సోమవారం మంత్రి రాజనర్సింహ నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిమ్స్, గాంధీ, ఉస్మానియా, నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లలో బెడ్ల కోసం ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఎమ్మెల్యేలకు ఫోన్లు వస్తున్నాయని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లాల్లోని ప్రభుత్వ హాస్పిటళ్లను బలోపేతం చేస్తే హైదరాబాద్‌లోని ప్రధాన హాస్పిటళ్లపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. అంకాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కోరారు. పీహెచ్‌సీ మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నందిపేట్ పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, ఇందల్వాయిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేలు ప్రతిపాదించగా ఆయన సానుకులంగా స్పందించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పి. సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు ఫిజికల్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ ప్రారంభం



**అక్షరటుడే, బాల్కొండ :** బాల్కొండ మండలం కిసాన్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. గెజిటెడ్ హెచ్ ఎం కృష్ణవేణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకుని తాము పనిచేసే పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన క్రీడా శిక్షణ అందించి, వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. డీఆర్‌పీలు నన్‌సారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ సిలబస్‌కు సంబంధించిన అంశాలపై శిక్షణ అందించారు.




## ప్రారంభానికి సిద్ధమైన హనుమాన్ ఫాం విద్యుత్ ఉపకేంద్రం

**అక్షరటుడే, బోధన్:** నవీపేట్ మండలం లోని హనుమాన్ ఫాం గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. ట్రాన్స్‌కో చీఫ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) చౌహాన్ జైవంత్‌రావు, జిల్లా ఎస్ఈ పీవీ రాజేశ్వరరావు సోమవారం సాంకేతిక తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి లోపాలు లేవని నిర్ధారించిన అనంతరం వారిరువురు ఉపకేంద్రాన్ని ఛార్జ్ చేశారు. అధికారులు ఎం. శ్రీనివాసరావు, డి. వెంకటరమణ, స్వామి, తోట రాజశేఖర్, జి. ప్రశాంత్ రెడ్డి, కె. నటరాజ్, ఏ. కాశీనాథ్, ఆనంద్, జి. శ్రీనివాస్, భాస్కర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల అవస్థలు.. తహశీల్దార్‌పై ఆగ్రహం



**అక్షరటుడే, కోటగిరి :** ఉన్నత చదువుల కోసం అవసరమైన సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి తిప్పించుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. సోమవారం పోతంగల్ తహశీల్దార్, కార్యాలయ సిబ్బందిపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ..ఉన్నత విద్యలో భాగంగా తమ పిల్లలు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం మీ సేవల్లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే వీటిని ఆమోదించాల్సిన తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని.. రేపు రండి.. ఎల్లుండి రండి అంటూ తిప్పించుకుంటున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సిబ్బందికి ఇసుక రవాణాపై ఉన్న ఆసక్తి విద్యార్థుల సర్టిఫికెట్లపై లేదని ఆరోపించారు. వెంటనే తమ ధృవీకరణ పత్రాలను ఆమోదం తెలిపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హన్మాండ్లు,(బజరంగ్), ఎమ్మార్పీఎస్ నాయకుడు పోచీరం, రమేష్ సేట్, శివరాజ్ పటేల్, సజ్జత్, సంజు పటేల్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.



నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడి దాదాపు ఐదేళ్లు గడుస్తున్నా.. మీసేవ పోర్టల్‌లో మాత్రం ఇంకా పాత వివరాలే దర్శనమిస్తున్నాయి. దీంతో సర్టిఫికెట్లు, ఉద్యోగాల విషయంలో విద్యార్థులు, ఉద్యోగార్థులు అవస్థలు పడుతున్నారు. ఆధార్ కార్డుల్లో ఒక అడ్రస్.. జీపీలు ఇచ్చిన సర్టిఫికెట్లలో ఒకరకంగా ఉండడంతో వారు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రెవెన్యూపరంగా వెంటనే జీపీలను అప్‌డేట్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– అక్షరటుడే, గాంధారి

# అప్‌డేట్ కాని జీపీలతో అవస్థలు

■ ఐదేళ్లు గడుస్తున్నా పాత జీపీల పేర్లతోనే సర్టిఫికెట్లు.. ■ మీసేవలో పాత పంచాయతీల పేర్లే ప్రత్యక్షం
■ కుల, ఆదాయ పత్రాల్లో రాని కొత్త జీపీల వివరాలు ■ అంగన్‌వాడీ పోస్టుల అభ్యర్థుల తీవ్ర ఇబ్బందులు ■ సమాచారం ఇచ్చినా స్పందించని అధికారులు

గాంధారి మండలంలో రికార్డుల ప్రకారం 45 గ్రామ పంచాయతీలు ఉండగా, మీసేవలో రెవెన్యూపరంగా కేవలం 33 జీపీలు మాత్రమే కనిపిస్తున్నాయి. కొత్తగా ఏర్పడిన 12గ్రామ పంచాయతీలు అప్‌డేట్ కాకపోవడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త జీపీవాసులకు సైతం పాత పంచాయతీల పేర్లతోనే సర్టిఫికెట్లు వస్తుండటంతో ప్రభుత్వ పథకాలు, ఉద్యోగ దరఖాస్తులకు ఇబ్బందిగా మారింది.

### అందరికీ ఇబ్బందులు..

గాంధారి మండలంలో 45జీపీలుగా మారి సుమారు ఐదేళ్లు కావస్తోంది. అయినప్పటికీ 45 జీపీల్లో 12 జీపీలు ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో చేరు కాలేదు. దీంతో పాత రికార్డుల ప్రకారమే అధికారులు సర్టిఫికెట్లు ఇస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చేసేదేం లేక స్థానిక అధికారులు చేతిరాతతో సర్టిఫికెట్లు ఇస్తామని పేర్కొంటున్నప్పటికీ అవి అధికారికంగా చెల్లకపోవడంతో విద్యార్థులు అయోమయంలో పడుతున్నారు.

### స్పందించని అధికారులు

సమస్య తీవ్రతపై వివరణ కోరేందుకు గడిచిన రెండు రోజులుగా ఈడీఎంను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ పోస్టుల భర్తీ ప్రక్రియ నడుస్తుండటంతో, సర్టిఫికెట్లలో కొత్త జీపీల పేర్లు రాక అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

### ఈడీఎం నిర్ణయంపైనే ఆధారం

గాంధారి మండలంలో మొత్తం 45 జీపీలు ఉండగా, రెవెన్యూ పరంగా 33 మాత్రమే మీసేవలో అప్‌డేట్ అయ్యాయి. మిగితా 12 జీపీలను పోర్టల్‌లో చేర్చడం అనేది పూర్తిగా ఈడీఎం (EDM) పరిధిలోని అంశం. వారి నిర్ణయం ఆధారంగానే అప్‌డేషన్ జరుగుతుంది.

– రేణుక చవన్, తహశీల్దార్

### అన్ని జిల్లాల్లో సమస్య

మీసేవలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యను ఇప్పటికే ఈడీఎం దృష్టికి తీసుకెళ్లాం. త్వరగా సమస్యను పరిష్కరించాలని కోరాం. ఇది కేవలం ఒక మండలానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. జిల్లాలోని అనేక మండలాల్లో ఇదే పరిస్థితి ఉంది. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జీపీలను ఒకేసారి అప్‌డేట్ చేసే అవకాశం ఉంది.

– బల్వంత్ రావు, మీసేవ జిల్లా అధ్యక్షుడు

### దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేశాం..

మా గ్రామం లొంక తండా నూతనంగా పంచాయతీగా మారినప్పటికీ మీసేవలో పాత పంచాయతీ 'దుర్గం' పేరుతో మాత్రమే వస్తోంది. అంగన్‌వాడీ పోస్టుల దరఖాస్తు గడువు ముగుస్తుండటంతో అభ్యర్థులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. చివరికి ఎల్లారెడ్డి నుంచి తహశీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడించి, ప్రత్యేక చొరవతో దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యేలా చూశాం.

– ప్రేమ్‌సింగ్, మాజీ సర్పంచ్



## కాంగ్రెస్ గుత్ప గ్రామ శాఖ అధ్యక్షుడిగా పెద్దబైరి సతీష్



**అక్షరటుడే, ఆర్మూర్:** కాంగ్రెస్ పార్టీ గుత్ప గ్రామ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పెద్దబైరి సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీసీసీ అధ్యక్షుడు నాగేష్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేగం ప్రమోద్, గుత్ప గ్రామ సర్పంచ్ దశరథ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన కాంగ్రెస్ నాయకులకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి కార్యకర్తను కలుపుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు శశి కుమార్, సీనియర్ నాయకులు జితేందర్, భూమేశ్వర్, సాయిరెడ్డి, పోషన్న, నవీన్, సల్మాన్ రాజ్, రాజేష్, గంగాధర్, నజీర్, రమేష్, ప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి ప్రాజెక్ట్‌లో ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** భూభారతి ప్రాజెక్ట్‌లో ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ భుజంగరావు ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ టెక్నికల్ ఉద్యోగుల అసోసియేషన్ స్టేట్ ఉమెన్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ పసల వసుంధర మాట్లాడుతూ.. ధరణి ప్రాజెక్ట్ అమలులోకి వచ్చినప్పటి నుంచి తాము రెవెన్యూ విభాగానికి నిరంతరాయంగా సాంకేతిక సేవలందిస్తున్నామన్నారు. భూ భారతి ప్రాజెక్ట్‌లోనూ తాము పనిచేస్తున్నామని వివరించారు. తహశీల్దార్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, కలెక్టరేట్, ఇతర రెవెన్యూ కార్యాలయాలలో ఆన్‌లైన్ భూ లావాదేవీలను నిర్వహించడం, మ్యుటేషన్ సేవలు, డేటా ధృవీకరణ, పోర్టల్ నిర్వహణ, సాంకేతిక సమస్యల పరిష్కారం అన్నింటిలోనూ తాము విధులు నిర్వహిస్తున్నామని వివరించారు. తమకు రావాల్సిన జీతాలు నెలల తరబడిగా రావట్లేదని ఆమె వాపోయారు. జీతాలు రాకపోవడంతో తమ కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని వాపోయారు. జిల్లావ్యాప్తంగా 33 మంది ఎఫ్‌టీఎస్ సిబ్బందికి నెలవారీగా జీతాలు ఇవ్వాలని.. బకాయిలు వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే సిబ్బంది సేవలను ఎప్పటిలాగే పునురుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## అమృతేశ్వర ఆలయంలో అన్నదానం



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలోని అమృతేశ్వర ఆలయం(లింగమయ్య గుట్ట) పైన ప్రతి సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. పూజారి ధనరాజ్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం అలంకరణ పూజలు నిర్వహిస్తారని చెప్పారు. సోమవారం శివుడికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొంటారని తెలిపారు. ఇప్పటివరకు 21 సోమవారాలు అన్నదానం చేశామని తెలిపారు.

## సదాశివనగర్‌లో ఘోరం.. ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి

**అక్షరటుడే, కామారెడ్డి :** ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. సదాశివనగర్ మండలం యాచారం గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి మండలం చంద్రాయన్ పల్లి గ్రామానికి చెందిన సంగేమ్ అజిత్ కుమారుడు లక్ష్మణ్ (9) స్థానిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాడు. కాగా సదాశివనగర్ మండలంలోని యాచారం గ్రామంలో బంధువుల ఇంటి వద్ద దశదిన ఖర్మ కార్యక్రమానికి వచ్చారు. గ్రామంలో బాలుడు బయట ఆడుకుంటుండగా ఓ ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడిని తక్షణమే చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రికి చేరుకునే సరికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బాలికపై లైంగిక వేధింపులు.. నిందితుడికి 12 ఏళ్ల జైలుశిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడికి నిజామాబాద్ జిల్లా న్యాయస్థానం 12 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ఈ మేరకు సోమవారం తీర్పు వెలువరించింది. నగరంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన బింగి అంకుష్‌పై కేసు నమోదైంది. బాలికను లైంగికంగా వేధించినట్లుగా ఫిర్యాదు రావడంతో 2020లో మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్సై సంతోష్‌కుమార్ పోక్సో కేసు రిజిస్ట్రర్ చేశారు. ఈ క్రమంలో బాధితురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా బెదిరింపులకు గురిచేసినట్లుగా విచారణలో వెల్లడైంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఫాస్ట్ ట్రాక్ కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎ.రాజా రెడ్డి, జి.నరసింహా రెడ్డి వాదనలు వినిపించి, నిందితుడికి శిక్ష పడేలా సాక్ష్యాధారాలను సమర్పించారు. దీంతో నిజామాబాద్ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం జిల్లా అదనపు సెషన్స్ న్యాయమూర్తి డి. వరూధిని సోమవారం తీర్పు వెలువరించారు. ఐపీసీ సెక్షన్ 354(ఏ) కింద ఏడేళ్ల జైలుశిక్ష రూ.పదివేల జరిమానా విధించారు. అలాగే పోక్సో యాక్ట్ సెక్షన్ 12 కింద ఐదేళ్ల జైలుశిక్ష, రూ.ఐదువేల జరిమానా విధించారు. బాధిత బాలికకు నష్టపరిహారం ఇప్పించేలా కృషి చేయాలని న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేశారు.

## ఆదుకోవాల్సిన కొడుకు రోడ్డుపైకి గెంటేశాడు..



**అక్షరటుడే, కామారెడ్డి:** వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన కొడుకు ఇంట్లోంచి గెంటేయడంతో ఓ తల్లి న్యాయం కోసం అధికారులను ఆశ్రయించింది. కామారెడ్డి అశోక్‌నగర్ కాలనీకి చెందిన హుస్సేన్ బీ భర్త షేక్ ఉస్మాన్, పెద్ద కొడుకు షేక్ ఈదుల్ ఇటీవల మరణించారు. చిన్న కొడుకు చాంద్ పాషా విడాకులు తీసుకున్నాడు. ఆ తర్వాత పెద్ద కోడలు, చిన్న కొడుకు కలిసి ఉంటున్నారని, ఇది తప్పని ప్రశ్నించినందుకు తనను ఇంట్లోంచి బయటకు పంపారని వాపోయింది. ఆస్తిలో హక్కు ఇవ్వడం లేదు, పోషణ ఖర్చులు కూడా ఇవ్వడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఒంటరి మహిళ పెన్షన్‌తో బతుకుతూ కూతుళ్ల ఇళ్లలో ఉంటున్నట్లు పేర్కొంది. భరించలేక సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన హుస్సేన్ బీ, తనకు చట్టపరమైన రక్షణ, పోషణ, ఆస్తి హక్కు కల్పించి, వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వేడుకుంది.